

విజయోత్సవాలా..?
హామీలు అమలు చేయకుండా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. - 8లో



వెల్ఫేర్ కమిషన్ ఏర్పాటు చేయాలి
భూ నిర్వాసితుల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ కమిషన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. - 8లో



నిరాశ ఉన్న మాట వాస్తవమే
హామీలన్నీ అమలు కాకపోవడంతో ప్రజలు నిరాశలో ఉన్నారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

5 నుంచి డీఈఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి(నల్లగొండ) : డీఈఈ సెట్ 2024 సెకండ్ ఫేజ్ సర్టిఫికెట్ల పరిశీలన డిసెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని నల్లగొండ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని డైట్ కళాశాలలో డిసెంబర్ 5వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. 7 నుంచి 9 వరకు ర్యాంకుల ప్రకారం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, 13వ తేదీన సీట్లు కేటాయించనున్నామని తెలిపారు. సీటు పొందిన వారు 13 నుంచి 17వ తేదీ వరకు కాలేజీలో రిపోర్టు చేయాలని సూచించారు.

బి.వెల్లెంల ప్రాజెక్టు పరిశీలన



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నార్కట్‌పల్లి : బ్రాహ్మణ వెల్లెంల – ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. రిజర్వాయర్, పంపుహౌస్, నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్, హెలీపాడ్ ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఈఈ గంధం శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ విఠలేశ్వర్, శ్రీనివాస్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఈ నవీన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులు

కట్టంగూర్ : యాసంగి సీజన్‌లో రైతులకు ఇబ్బంది కలుగకుండా సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని రైతువేదికను ఆయన సందర్శించి రైతు రుణమాఫీ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కట్టంగూర్, అయిటిపాముల గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి ఎరువులు, విత్తనాలను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఏపీ ఎరువుకు బదులు నానో డీఏపీని వినియోగించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ వై.గిరిప్రసాద్, ఏఈఓలు పరుశురాము, నవీన్ ఉన్నారు

గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపిక



శివలీలారెడ్డి

కనగల్ : మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకురాలు, న్యూ కంబాల శివలీలా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ శివలీలారెడ్డి గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 12న హైదరాబాద్‌లో తెలంగాణ సాంస్కృతిక సారధి డాక్టర్ వెన్నెలగద్దర్ చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకోనున్నారు.

ఆర్టీసీకి ఉద్యోగులే మూలస్తంభాలు



మొక్క నాటుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీకి మూలస్తంభాలు కార్మికులు, ఉద్యోగులేనని రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ ఉద్యోగులు కొంత ఒత్తిడికి గురయ్యారని.. ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించేందుకు అన్ని డిపోల్లో వన భోజన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం డిపోలో మొక్క నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం శివశంకర్, డీఎం జి.మోహన్‌రెడ్డి, సీఐ భారతీబాయి ఉన్నారు.

నేడు దర్వేశిపురం ఆలయం వద్ద వేలం

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవస్థానం వద్ద (2025–26) సంవత్సరానికి కొబ్బరికాయలు, లడ్డు, పులిహోర, గాజులు, కిరాణం, మిఠాయి అమ్మకాలు, ఫొటోలు తీసేందుకు బుధవారం వేలం నిర్వహిస్తున్నటు ఆలయ ఈఓ జల్లేపల్లి జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే ఎల్లమ్మ దేవస్థానం దర్వేశిపురం పేరున డీడీ తీసి దేవస్థానం కార్యాలయం వద్ద అందజేయాలని సూచించారు.

● దివ్యాంగుల ర్యాలీ



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

● విజయోత్సవ 'రన్'



ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల వద్ద 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

రూ.143.32 కోట్లతో 18 చెక్‌డ్యామ్‌లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.143.32 కోట్లతో 18 చెక్ డ్యామ్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు పాలనపరమైన అనుమతులను మంజూరు చేసింది. సూర్యాపేట, తుంగతుర్తి, దేవరకొండ నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు (జీఓ 328) జారీచేశారు. సూర్యాపేట జిల్లా సీఈ పరిధిలో సదర్శాపూర్, ధర్మారం, చిన్నపడిశాల, అనంతారం, తాటిపాముల, వర్ధమాన్‌కోట, యెండ్లపల్లి, కె.టి.అన్నారం, కాసరబాద, గుండ్లసింగారం బాట ముక్కులుదేవలపల్లి, గొస్‌తండా బాట ముక్కుడుదేవలపల్లి, నల్లగొండ జిల్లా సీఈ పరిధిలో మాధాపూర్, పొల్కంపల్లి, ఉమ్మాపూర్, ఏపూర్, నాగరిగడ్డ, గట్టుకిందితండా, పర్వేల్ ప్రాంతాల్లో ఈ చెక్ డ్యామ్‌లను నిర్మించనుంది.

సాగుతున్న.. ఎల్‌ఆర్‌ఎస్

పట్టించుకోని అధికారులు.. సమాచారం లేని ప్రజలు

- ఉమ్మడి జిల్లాలో నత్తనడకన సాగుతున్న ప్రక్రియ
- వచ్చిన దరఖాస్తులు దాదాపు 2.5 లక్షలు
- పరిశీలనకు నోచుకోనివి లక్షన్నరకు పైగానే..
- ఆదాయం వస్తున్నా నిర్లక్ష్యం వీడని యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో 19 మున్సిపాలిటీలు ఉండగా, నాగార్జునసాగర్ మినహా మిగతా మున్సిపాలిటీల పరిధిలో భారీగా దరఖాస్తులు వచ్చినా వాటిని పరిష్కరించడంలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. దరఖాస్తుదారులకు నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలు చేపట్టడంతో యంత్రాంగం విఫలమవుతోంది. ఆగస్టు నెలలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైనా మున్సిపాలిటీల్లో ఇంతవరకు 8.18 శాతం మాత్రమే క్రమబద్ధీకరించడం గమనార్హం.

భారీగా దరఖాస్తులు

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 2020 ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకొచ్చింది. దీనికి ఉమ్మడి జిల్లాలో ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. నాగార్జునసాగర్ మినహా మిగతా 18 మున్సిపాలిటీల్లో రూ.1000 చొప్పున ఫీజు చెల్లించి 1,90,475మంది రూ.19.04 కోట్లు, మండల కేంద్రాలు, గ్రామాల్లో 57,554 మంది రూ.5.75 కోట్లు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో తలెత్తిన న్యాయ వివాదాల కారణంగా దరఖాస్తుల పరిశీలన పెండింగ్‌లో పడింది. తాజాగా ప్రభుత్వం ఆగస్టు నెలలో రెగ్యులరైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దరఖాస్తులను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వాటిని క్రమబద్ధీకరించడంలో ఆలస్యం తప్పడం లేదు.

పరిశీలనలో యంత్రాంగం విఫలం

నాలుగేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్ సకాలంలో అప్‌లోడ్ చేయలేదు. ప్రస్తుతం వారంతా ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్ ద్వారా డాక్యుమెంట్స్ సబ్మిట్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అలా డాక్యుమెంట్స్ సబ్మిట్ చేసిన వాటిని కూడా పరిశీలించి తగిన చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

ప్రాసెస్ చేసింది.. మూడింట ఒకటో వంతే..

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో 1,90,475 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో కేవలం మూడో వంతు (60,205) దరఖాస్తులను మాత్రమే అధికారులు ఇప్పటివరకు ప్రాసెస్ చేయగలిగారు. వాటిల్లో 3,513 దరఖాస్తులను తిరస్కరించిన అధికారులు సరైన డాక్యుమెంట్స్ లేవని 14,854 దరఖాస్తులను పక్కన పెట్టారు. కేవలం 15,557 మంది దరఖాస్తులను మాత్రమే పూర్తిస్థాయిలో పరిశీలించి క్రమబద్ధీకరణకు ఓకే చెప్పారు. మిగతా దరఖాస్తులన్నీ వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉండిపోయాయి.

జిల్లాలోని మున్సిపాలిటీల వారీగా వివరాలు ఇలా..

మున్సిపాలిటీ	దరఖాస్తులు	పరిశీలన	తిరస్కరణ	పక్కన పెట్టినవి	క్రమబద్ధీకరించినవి
హాలియా	3418	1250	6	35	780
మిర్యాలగూడ	14335	1992	0	0	108
చండూరు	3619	2026	46	0	270
నల్లగొండ	36116	16086	353	6428	7500
నకిరేకల్	5361	3500	56	0	8
చిట్యాల	3208	1205	86	378	6
దేవరకొండ	5022	1152	3	35	6

అన్ని మున్సిపాలిటీల్లోనూ అదే పరిస్థితి

జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీ పరిధిలో వచ్చిన దరఖాస్తులతో పోల్చితే క్రమబద్ధీకరించిన వాటి సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఆరు మున్సిపాలిటీల్లో క్రమబద్ధీకరించిన వాటి సంఖ్య రెండంకెలకు కూడా చేరలేదు. 9 మున్సిపాలిటీల్లో క్రమబద్ధీకరించిన వాటి సంఖ్య వందల్లో ఉండగా, కేవలం మూడు మున్సిపాలిటీల్లో మాత్రమే వాటి సంఖ్య వేలల్లో ఉంది.

7న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక

- ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ : అభివృద్ధి పనుల ప్రారంభోత్సం, శంకుస్థాపన కార్యక్రమాల కోసం ఈనెల 7న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్లో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్ల విషయంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి 7వ తేదీన బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు, యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్, నల్లగొండ మెడికల్ కళాశాల, స్కిల్ సెంటర్‌ను ప్రారంభిస్తారని.. నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఆర్‌ఓ అమరేందర్, దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ (శాలిగౌరారం) : ఉద్యోగులు విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. మంగళవారం శాలిగౌరారం మండలంలో పర్యటించిన ఆమె మొదటగా కేజీబీవీని సందర్శించారు. విద్యాలయంలోని వంటగదిని, వంటలను, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, శానిటేషన్‌ను పరిశీలించారు. శానిటేషన్ సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అభివృద్ధి పనులపై ఎస్‌ఓను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అభివృద్ధి నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేస్తానని చెప్పారు. అనంతరం మండలంలోని వల్లాల మోడల్‌స్కూల్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఎంఈఓ సైదులు ఉన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సరెండర్

వల్లాల మోడల్‌స్కూల్‌లో అపరిశుభ్ర వాతావరణం మధ్యాహ్న భోజనంలో నాణ్యతా లోపం, నిత్యావసరాలు, కూరగాయలు పరిశుభ్రంగా లేకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగానూ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను సరెండర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ కలెక్టర్ రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ పాలనపై బీజేపీ చార్జిషీట్



చార్జిషీట్ విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : కాంగ్రెస్ ఏడాది పాలనపై బీజేపీ జిల్లా నాయకులు మంగళవారం నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయనందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. నల్లగొండకు బైపాస్ పేరుతో మంత్రి కోమటిరెడ్డి తన అనుచరుల భూముల చుట్టూ రోడ్డు వేస్తూ పేదల పొట్టు కొడుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వైఫల్యాలు, అసమర్థత, అవగాహనా రాహిత్యం వల్లే నల్లగొండ పట్టణం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పోతె పాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, మిర్యాల వెంకటేశం, పెరిక మునికుమార్, జగ్జీవన్, పకీరు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన విద్యార్థులకు కలెక్టర్ పరామర్శ



విద్యార్థినిని పరామర్శిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో అస్వస్థతకు గురై దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం రాత్రి పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించిన విషయాలపై ఆరా తీశారు. విద్యార్థినలకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడతూ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరగలేదని.. రెండు మూడు రోజులుగా విద్యార్థులు సరిగా ఆహారం తీసుకోకపోడంతో నీరసంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడించారు.

కోతకు ఓకే అంటేనే.. కొనుగోలు!

- సీసీఐ కేంద్రాల్లో రైతులను దోపిడీ చేస్తున్న నిర్వాహకులు
- మునుగోడులోని మిల్లుల్లో ట్రాక్టర్‌కు క్వింటా వరకు కటింగ్
- చెప్పినట్లు వినని రైతుల పత్తికి కొర్రీలు పెట్టి కొనుగోలుకు నిరాకరణ
- పత్తి మిల్లు వద్ద రైతుల ఆందోళన
- కోతలు పెట్టకుండా కొనాలని డిమాండ్



సలాసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఖాళీ ట్రాక్టర్‌ను తూకం వేసే సమయంలో కాంటాపై కూర్చున్న వ్యక్తి

మునుగోడు : పత్తికి మద్దతు ధర చెల్లించేందుకు ప్రభుత్వం జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లోనూ రైతులకు కష్టాలు తప్పడం లేదు. మునుగోడు మండలంలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి తూకంలో కోత విధిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అలా ఒప్పుకున్న రైతుల పత్తినే కొనుగోలు చేసున్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలోని జైబింధు, మునుగోడు శివారులోని సలాసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లుల్లో ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతోంది. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యహరిస్తున్నారు. ఏ రైతైయితే కోతకు నిరాకరిస్తున్నారో వారి పత్తి కొనుగోళ్లు చేయడం లేదు. ఈ వ్యవహారంపై కొంపల్లి జిన్నింగ్ మిల్లు వద్ద మంగళవారం రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు చేయాలని, ఎలాంటి కోత విధించవద్దని నినదించారు.

ట్రాక్టర్‌కు 50 కేజీల నుంచి క్వింటా వరకు కోత..

చండూరు మార్కెట్ పరిధిలోని నాలుగు జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోళ్లు నెల రోజులుగా సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం రైతులు తీసుకొచ్చిన పత్తిని సీసీఐ సిబ్బంది తేమశాతం పరిశీలించి ధర నిర్ణయించి ఎలాంటి కోత(కటింగ్) చేయకుండా తూకం వేయాలి. కానీ, కొంపల్లిలోని జైబింధు జిన్నింగ్ మిల్లుతో పాటు మునుగోడు శివారులోని సలాసర్ బాలాజీ మిల్లులో నిర్వాహకులే తేమశాతం చూసి రైతుల పత్తికి అనేక సాకులు చెప్పుతూ కొనుగోలు చేయకుండా ఒకటి, రెండు రోజులు నిలిపివేస్తున్నారు. పత్తిలో కోతకు సరైనని ఒప్పుకున్న రైతు వాహనంలోని పత్తి తూకం వేసి.. తిరిగి ఖాళీ వాహనం తూకం వేసే సమయంలో ఒక్కో ట్రాక్టర్‌కు 50 కేజీల నుంచి 1 క్వింటా వరకు కోత విధించేందుకు అక్కడే ఉన్న రైతుని లేదా కాంటా బాట్లు తూకంపై ఉంచి కోత విధిస్తున్నారు. ఒక్కో జిన్నింగ్ మిల్లులో రోజు 150కి పైగా రైతుల వాహనాలు పత్తి కొనుగోళ్లు చేస్తుండగా అందులో దాదాపు 100 మంది రైతుల నుంచి కోత పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం మార్కెట్ అధికారులతో పాటు సీసీఐ సిబ్బందికి తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు అంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పత్తిలో కోత విధిస్తున్నవారిపై చర్యలు తీసుకొని రైతులకు మేలు కలిగేలా చూడాలని రైతు సంఘాల నాయకులు, రైతులు కోరుతున్నారు.

మూడు క్వింటాళ్ల పత్తి కట్ చేసుకున్నారు



నేను 16 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాను. అందులో 88 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తే మా గ్రామంలోని జైబింధు జిన్నింగ్ మిల్లులోని సీసీఐ కేంద్రానికి వారం క్రితం రెండు ట్రాక్టర్లలో తీసుకెళ్లాను. నా పత్తిలో తేమశాతం అధికంగా ఉందని రెండు రోజులు కొనుగోలు చేయలేదు. నిర్వాహకులను బతిమిలాడితే ఒక ట్రాక్టర్‌కు 2 క్వింటాళ్లు, మరో ట్రాక్టర్‌కు 1 క్వింటా మొత్తం 3 క్వింటాళ్లు కట్ చేయించుకుని నా పత్తి అమ్ముకున్నాను.

– జీడిమడ్ల మల్లేష్, కౌలు రైతు, కొంపల్లి, మునుగోడు మండలం

పత్తిలో కోత విధించవద్దు

సీసీఐ కేంద్రంలో అమ్ముకునే పత్తిలో ఎలాంటి కోత (కటింగ్) విధించవద్దు. ఇప్పటికే చండూరు మార్కెట్ సిబ్బందికి పలుమార్లు సూచనలు చేశాం. అయినా అలాంటి ఆరోపణలు పదేపదే వస్తున్నాయి. త్వరలో సీసీఐ కేంద్రాలను పరిశీలించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం. రైతుల వద్ద పత్తి కటింగ్ చేయడం అన్యాయం. పత్తి కటింగ్ చేసిన రైతులు నేరుగా ఫిర్యాదు చేస్తే తగిన న్యాయం చేస్తాం.

– ఛాయదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి

చింతపల్లి శివసాయి మిల్లు ఎదుట రైతుల ఆందోళన



చింతపల్లిలో హైదరాబాద్ - నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై ఆందోళనకు దిగిన రైతులు

చింతపల్లి : మండల కేంద్రంలోని శివసాయి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో అధికారులు, మిల్లు యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తేమసాకు చూపి సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రి సమయంలో మిల్లు యాజమాన్యం తమ సొంత వాహనాలను అక్కడ ఉంచి ఉదయానే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులు ఆందోళనకు దిగారన్న సమాచారంతో పోలీసులు అక్కడకికి చేరుకుని సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

పత్తి కొనుగోలు చేయాలి



మార్కెటింగ్ అధికారులు,రైతులతో మాట్లాడుతున్నకలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ : సీసీఐ కేంద్రాల్లో పత్తిని వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నకిరేకల్ మండలం నెల్లిబండ శివారులోని సీసీఐ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులుగా కొనుగోలు చేయలేదని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే ఆమె సీసీఐ అధికారులతో మాట్లాడి కొనుగోళ్లు నిలిపివేయొద్దన్నారు. కలెక్టర్ వెంట జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, మార్కెట్ కార్యదర్శి శ్రీనాథచారి, మిల్లు నిర్వాహకులు గజ్జెల రామకృష్ణ, కోటగిరి రమేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

గ్రామపంచాయతీ ట్రాక్టర్ చోరీ

వేములపల్లి : గ్రామపంచాయతీ ట్రాక్టర్ ఇంజన్ చోరీ అయిన సంఘటన వేములపల్లి మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వేములపల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను సిబ్బంది కార్యాలయం ఎదుట రాత్రి వేళ ఉంచి వెళ్లారు. ఉదయం ట్రాక్టర్ కోసం సిబ్బంది వెళ్లగా కనిపించకపోవడంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం

చౌటుప్పల్ : బాలిక అదృశ్యమైన ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన బొట్టు బత్తుల రవి-మాధవి స్థానిక మణికంఠ కాలనీలో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న చౌటుప్పల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుస్తుల దుకాణం నడుపుతున్నారు. వీరికి హాసిని (17)కుమార్తె ఉంది. ప్రస్తుతం ఆమె ముంబాయిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. గత నెల 27న ముంబాయి నుంచి హాసిని చౌటుప్పల్‌కు వచ్చింది. రోజువారిగానే తల్లిదండ్రులు సోమవారం ఉదయం దుకాణానికి వెళ్లారు. కుమార్తె ఇంటి వద్దనే ఉంది. రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి చేరుకునేసరికి కుమార్తె ఇంట్లో కనిపించలేదు. స్థానికంగా వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. ఈ మేరకు తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ కేంద్రానికి చెందిన చింతకింది మణిరాం అనే బాలుడిని అనుమానిస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

నేరేడుచర్ల : పట్టణంలోని రామాపురంలో గల ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉన్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మంగళవారం నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు రామాపురంలోని వీరమల్ల శ్రీనివాస్ నివాసంలో అక్రమంగా నిల్వ ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ బంగారంతో మోసం

భువనగిరిటౌన్ : నకిలీ బంగారాన్ని అసలు బంగారంగా నమ్మించి ఓ దుకాణదారుడిని మోసం చేసిన సంఘటన భువనగిరిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి గంజ్ మార్కెట్లో చంద్రప్రకాష్ చౌదరి ఆదివారం తన బంగారం దుకాణంలో ఉండగా ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ దగ్గర నాలుగు తులాల బంగారం పాత గొలుసు ఉందని.. దానిస్థానంలో కొత్త బంగారం కావాలని నమ్మబలికారు. ఆ గొలుసును ప్రాథమికంగా పరీక్షించిన చంద్రప్రకాష్ చౌదరి.. అసలు బంగారంగా నమ్మి మూడున్నర తులాల కొత్త బంగారం ఇచ్చాడు. సోమవారం ఆ గొలుసును పూర్తిగా కరిగించగా కాపర్ అని తేలడంతో మోసపోయినట్లు గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సూర్యాపేటలో మంగళవారం జరిగింది. వివరాలు.. సువెన్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న బానోత్ బాబునాయక్ (50) ఫ్యాక్టరీలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాం వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాబునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వెల్ఫేర్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

చౌటుప్పల్ : రాష్ట్రంలో భూ నిర్వాసితుల కోసం ప్రత్యేకంగా భూ నిర్వాసితుల వెల్ఫేర్ కమిషన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరిట అడ్డగోలుగా భూములను లాక్కుంటున్న ప్రభుత్వానికి నిర్వాసితులకు పరిహారం ఇచ్చేందుకు మనసు రావడంలేదని విమర్శించారు. అధికారం ఉందనే అహంకారంతో అడ్డగోలుగా వ్యవహరించి రైతులు, పేదల వద్ద భూములు లాక్కోవడం సరికాదన్నారు. ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులకు బీజేపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిర్వాసితులకు అండగా ఉండాల్సిన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తిగా డమ్మీలుగా మారారని



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

ఎద్దేవా చేశారు. ఓఆర్‌ఆర్‌కు ట్రిపుల్‌ఆర్‌కు మధ్య 40 కిలోమీటర్ల దూరం ఉండాలనే నిబంధన అమలు చేయాల్సిందేనని అన్నారు. ఆ ప్రకారంగా అలైన్‌మెంట్ మార్చాల్సిందేనన్నారు. చౌటుప్పల్‌లో రెండు ఫార్మా కంపెనీల ప్రయోజనాల కోసం అప్పటి ప్రభుత్వం రైతులను నిండా ముంచేలా అలైన్‌మెంట్ రూపొందించిందని ఆరోపించారు. రైతులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పరిహారంతోపాటు ప్లాటు ఇవ్వాలన్నారు. ఎకరానికి 1000-1500 ఎస్ఎఫ్‌టీ టీడీఆర్ (ట్రాన్స్‌ఫరేబుల్ డెవలప్‌మెంట్ రైట్స్), ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే అన్ని పార్టీలను కలుపుకుని కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరు వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా కార్యదర్శి ఆలె చిరంజీవి, చౌటుప్పల్ పట్టణ, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, భూ నిర్వాసితులు, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, ఊడుగు వెంకటేశం, దబ్బెటి రాములు, జంగయ్య, ప్రభాకర్ రెడ్డి, మల్లేష్, బోవయ్య, మైసయ్య, అయిలయ్య, కృష్ణ, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, వేణు, దశరథ, ఉపేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

నిరాశ ఉన్న మాట వాస్తవమే



ప్రజా విజయోత్సవ సభలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

- గత ప్రభుత్వం నిర్వాకంతోనే ఈ పరిస్థితి
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : ప్రజలు ఎన్నో ఆశలతో తమకు ఓట్లు వేసి గెలిపించారని, హామీలన్నీ అమలు కాకపోవడంతో ప్రజలంతా నిరాశ నిస్పృహల్లో ఉన్న మాట వాస్తవమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం మూలంగానే హామీల అమలు ఆలస్యమవుతోందన్నారు. అయినా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల రుణ బకాయిలను మాఫీ చేయించే బాధ్యత తనదేనని అన్నారు. 50కోట్లు ఉన్నా 100కోట్లు ఉన్నా సీఎం, డిప్యూటీ సీఎంలతో మాట్లాడి పూర్తిగా మాఫీ చేయిస్తానని చెప్పారు.

పదేళ్లలో మీరేం చేశారు?

ఏడాదికే కాంగ్రెస్ పాలనపై ఏడుస్తున్నారు.. పదేళ్లలో మీరేం చేశారని రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులను నిలదీశారు. హరీష్‌రావు, కేటీఆర్, కవితలు నిత్యం ఏదో రాద్ధాంతం చేస్తూ పెడబొబ్బలు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, చేనేత ఆర్‌డీడీ పద్మ, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, చేనేత ఏడీ కామెల్, డీవో శ్రీనివాస్, ఏడీవో కిషన్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పునీత శౌరి చర్చి వార్షికోత్సవం



దివ్యబలి పూజ నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ చిన్నయ్య

మఠంపల్లి: క్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తంగా ప్రచారం చేసిన ఫాదర్ శౌరి పునీతుడిగా కీర్తించబడ్డాడని రెవరెండ్ ఫాదర్ చిన్నయ్య అన్నారు. మంగళవారం మఠంపల్లిలోని శౌరీనగర్‌లో గల పునీత శౌరి చర్చి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని దివ్యబలి పూజ నిర్వహించి క్రైస్తవులకు భక్తి సందేశమిచ్చారు. ఈ సందర్భంగా కాకుమాను జోసెఫ్ భక్త బృందం ఆర్కెస్ట్రాతో ఆలపించిన భక్తి గేయాలు అలరించాయి. కార్యక్రమంలో ఫాదర్లు మార్టిన్, బాల్‌రెడ్డి, ఇన్నిరెడ్డి, రాజురెడ్డి, అరుణ్, సాగర్, స్టీఫెన్, జోసెఫ్‌రెడ్డి, క్రైస్తవ పెద్దలు ఆదూరి కిశోర్‌రెడ్డి, జయభారత్‌రెడ్డి, థామస్‌రెడ్డి, చిన్నపరెడ్డి, ఆంథోనిరెడ్డి, లూర్దురెడ్డి, ఫాతిమారెడ్డి, బాలశౌరెడ్డి, జోజిరెడ్డి, ఇన్నారెడ్డి, జార్జిరెడ్డి, లూర్దుమారెడ్డి, విక్టర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం

కోదాడరూరల్ : వాటర్ హీటర్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్.నస్రీన్ (30) తన ఇంటిలో నీటిని వేడి చేసేందుకు వాటర్ హీటర్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడిని పిలిపించి పరీక్ష చేయించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై భర్త మహమూద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దొంగతనం చేసిన వ్యక్తికి జైలు.. జరిమానా

చౌటుప్పల్ : దొంగతనం చేసిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతీవైష్ణవి మంగళవారం తీర్పునిచ్చారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శామీర్‌పేట మండలం లచ్చిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారెం ఆనంద్ రెడ్డి ఐదు నెలల క్రితం చౌటుప్పల్‌లో ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. అప్పట్లో కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ యాదగిరి విచారణ నిర్వహించగా నిందితుడు పట్టుబడ్డాడు. ఆ మేరకు కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడు నెలల జైలు శిక్షతోపాటు వంద రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అనంతరం నిందితుడిని నల్లగొండ జిల్లా కేంద్రంలోని జైలుకు తరలించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్న సంఘటన చింతలపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి చింతలపాలెంకు అక్రమంగా ఇసుకను టిప్పర్ ద్వారా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు చింతలపాలెం గ్రామ శివారులో టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. జగ్గయ్యపేటకు చెందిన టిప్పర్ డ్రైవర్ రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎయిమ్స్‌లో సర్జరీ విజయవంతం

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో మంగళవారం ప్రసూతి, స్త్రీ జ్ఞానేంద్రియ విభాగం ఆధ్వర్యంలో మొదటిసారిగా ఎండోస్కోప్, బయోకో ప్యో స్టీయోమ్ సర్జరీని ఎయిమ్స్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా మాట్లాడుతూ ఎయిమ్స్‌లో మహిళలకు గర్భాశయ సమస్యలకు సంబంధించి వివిధ రకాల సర్జరీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇన్‌ఫెర్టిలిటీ, పాలిపెక్టోమిన్, గర్భాశయ క్రమరాహిత్యాలు, డయాగ్నోస్టిక్ తదితర వైద్యసేవలతో పాటు గైనకాలజీలోని ఎండోస్కోపీ, హిస్ట్రోస్కోపీ, ప్రెగ్నెన్సీ వంటి అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు.



సర్జరీలో పాల్గొన్న ఎయిమ్స్ వైద్యులు

శ్రీకాంతాచారి ఆశయాలు నెరవేరుస్తాం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- గత ప్రభుత్వం తమ కుటుంబాన్ని పట్టించుకోలేదని శంకరమ్మ ఆవేదన



శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీర్ల అయిలయ్య , శంకరమ్మ తదితరులు

మోత్కూరు : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి ఆశయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలనలో నెరవేరుస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలో శ్రీకాంతాచారి 15వ వర్ధంతి సభను మంగళవారం శ్రీకాంతాచారి తల్లిదండ్రులు కాసోజు శంకరమ్మ-వెంకటాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి విగ్రహానికి బీర్ల అయిలయ్యతోపాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బీర్ల అయిలయ్య మాట్లాడుతూ శ్రీకాంతాచారి త్యాగాన్ని తెలంగాణ చరిత్రలో ఎవరూ చెరిపివేయలేరన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో శంకరమ్మ కుటుంబానికి అన్యాయం చేసిందని, ప్రజా పాలనలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాంతాచారి ప్రాణ త్యాగంతోనే తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందన్నారు.

నీకేమైనా వ్యతిరేకం పనిచేశానా సామేలన్నా..

'నీకు, నాకు పగనా... నీకేమైనా వ్యతిరేకం పనిచేశానా...తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన నా కుమారుడు శ్రీకాంతాచారి వర్ధంతి సభకు ఎందుకు హాజరు కాలేదు'అని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌ను శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ ప్రశించారు. గత పాలకులు తమ కుటుంబాన్ని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాంతాచారి తమ కుటుంబం కోసం ప్రాణ త్యాగం చేయలేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చేశాడని అన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆమె కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పొడిచేడు గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీకాంతాచారి కుటుంబానికి అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి, మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విమలవెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ జి.లక్ష్మినర్సింహారెడ్డి, సోమిరెడ్డి, అవి ఉమల్లు, సత్యనారాయణ చౌదరి, రామచంద్రు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య

భువనగిరి : మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరాగల్ల సాయికుమార్(24) మేడ్చల్ జిల్లాలోని ఘట్కేసర్ మండల పరిధిలో గల ఓ కళాశాలలో డిప్లొమా చేసే క్రమంలో ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ఈ విషయంలో వారి కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఉప్పల్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు సైతం నమోదయింది. ఈ విషయం బంధువులకు, స్నేహితులకు తెలిసిపోయిందని సాయికుమార్ పలుమార్లు తన తల్లిదండ్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలో మూడు నెలల నుంచి బాధపడుతూ మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే సాయికుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. 12 మందిపై కేసులు నమోదు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో రెండు రోజులుగా ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో 6 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, 450 కిలోల బెల్లం, 350 కిలోల పటిక, 36 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. 12 మందిపై కేసులు నమోదు చేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఎక్సైజ్ సీఐ జిన్నా నాగార్జునరెడ్డి కేసుల వివరాలు వెల్లడించారు. ఎక్సైజ్ సిబ్బంది ఈ నెల 1, 2వ తేదీల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో దాడులు నిర్వహించారు. చింతలపాలెం మండలం యర్రకుంట తండాకు చెందిన పద్య నర్సింహ ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ నుంచి నాగరాజు అతడి భార్య సుజాతతో కలిసి వారి ఆటోలో 450 కిలోల బెల్లం అక్రమంగా తీసుకొస్తుండగా దొండపాడు వద్ద ఆటోను పట్టుకుని సీజ్ చేశారు. వారితోపాటు వారికి బెల్లం విక్రయించిన నందిగామ వ్యాపారి రామకృష్ణపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన భూక్యా పీకా, భూక్యా చంటి, భూక్యా తేజ, భూక్యా వినోద్, బానోతు లచ్చిరామ్‌లు 3 ద్విచక్ర



పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలు, సిబ్బంది

వాహనాలపై 350 కిలోల పటిక, 15 లీటర్ల సారాను అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మఠంపల్లి మండల కొత్త తండాకు చెందిన బానోతు రవీందర్ తన వాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తుండగా సారా స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశామన్నారు. చింతలపాలెం మండలానికి గుర్తు తెలియని వ్యక్తి 6 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్ చేయగా అతడు పరారైనట్లు సీఐ తెలిపారు. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన మాలోతు శ్రీను 7 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. అతడి వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు జగన్మోహన్ రెడ్డి, దివ్య, వెన్నెల సిబ్బంది రుక్మారెడ్డి, నాగయ్య, జయరాజు, నాగమణి, నాగరాజు, రవికుమార్, బాలు, నవీన్, మోయిన్, సంజయ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిప్పర్తి : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన తిప్పర్తి మండలంలోని మామిడాల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన వాణి (25)కి మామిడాల గ్రామానికి చెందిన కోదాటి శ్రీనుతో 6 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. అనంతరం తరచూ వారిద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మంగళవారం భర్త శ్రీను నిద్రలేచి చూసేసరికి వాణి మరణించి ఉంది. వెంటనే ఈ విషయాన్ని వాణి తల్లిదండ్రులకు శ్రీను తెలియజేశాడు. తన కూతురి మరణంపై అల్లుడు శ్రీను, అత్తమామలు రాములు, కన్నమ్మ, వాణి బావ కోదాటి నాగరాజు, తోటి కోడలు మౌనికలపై అనుమానం ఉందని మృతురాలి తల్లి సింగం నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



కోదాటి వాణి (ఫైల్)

ఖాసీంపేట శివారులో ..

చివ్వెంల(సూర్యాపేట) : అనుమానాస్పద స్థితిలో ట్యాంకర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామ శివారులో గల శ్రీ స్వామి నారాయణ్ గురుకుల పాఠశాల పక్కన ఉన్న ఎస్సారెస్పీ కాలువ వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన వంగాల గోపాల్ (45) ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి తోటి ట్యాంకర్ డ్రైవర్లతో కలిసి భోజనాలు చేసి, అనంతరం ఎవరి వాహనంలో వారు నిద్రపోయారు. మంగళవారం తెల్లవారుజామున కాలువ పక్కన విగత జీవిగా పడిఉన్న గోపాల్‌ను చూసి తోటి డ్రైవర్లు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.మహేశ్వర్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

తండ్రి మృతితో అనాథలుగా మారిన పిల్లలు

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన బర్ల బాలనర్సు (40) మంగళవారం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాలనర్సు గొర్ల కాపరిగా కూలి పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గత ఏడాది ఆయన భార్య రేణుక కూడా మృతి చెందింది. వీరికి 7వ తరగతి చదువుతున్న కుమార్తె నికిష, ఐదో తరగతి చదివే కుమారుడు సాత్విక్ ఉన్నారు. కాగా ఏడాది కాలంలో భార్యాభర్తలు మృతిచెందడంతో నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. ఆ పిల్లలకు నాయనమ్మనే పెద్ద దిక్కు అయ్యింది.



అనాథలుగా మారిన నికిష, సాత్విక్

ఎర్రమట్టి తవ్వకాలపై విచారణ అధికారిగా నల్లగొండ ఏఎస్పీ

నవాబుపేట: వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని ప్రభుత్వ భూములు, గుట్టల్లో ఎర్రమట్టి అక్రమ తవ్వకాలపై విచారణ అధికారిగా నల్లగొండ జిల్లా ఏఎస్పీ రాములనాయక్ నియమితులయ్యారు. ఐజీ సత్యనారాయణ ఆదేశాల మేరకు రాములు నాయక్ మంగళవారం మిర్యాలగూడ సీఐ నాగరాజుతో కలిసి నవాబుపేట మండలంలోని ఆర్కతల, యావాపూర్, చిట్టిగిద్ద గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచులు, బాధితులను పిలిచి విచారణ చేశారు. అనంతరం నవాబుపేట పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించినా, కబ్జా చేసినా, ధ్వంసం చేసినా కఠిన చర్యలు తప్పవని అన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ రాములు నాయక్

అంబులెన్స్‌లో ప్రసవం

డిండి: పురిటి నొప్పులు రావడంతో ఓ మహిళను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో 108 అంబులెన్స్‌లోనే సాధారణ కాన్పుతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన మంగళవారం డిండి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన అంజలికి మంగళవారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి తరలించేందుకు భర్త శివ 108 అబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అంబులెన్స్ సిబ్బంది అంజలిని 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ఈఎంటీ భాస్కర్, ఐటీటీ భీమయ్య వైద్యం చేశారు. సాధారణ కాన్పులో తల్లీ ఆడ శిశువు సురక్షితంగా ఉన్నారు.

బాక్సింగ్‌లో ఎన్‌జీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు మంగళవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఇంటర్ యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ ఫిజికల్ డైరెక్టర్ ఆదె మల్లేశం తెలిపారు. కళాశాలకు చెందిన ఎం.ముఖేష్, పి.వినయ్, ఎస్‌కె.నయీం, బి.హరీష్, ఎస్.శివకోటేష్, ఎం.ప్రణయ్, ఎండీ.సిద్దిక్ అలీ, వి.అభిరామ్ వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. అమృత్‌సర్‌లో త్వరలో జరిగే జాతీయ బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున వీరు ఆడనున్నారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో సీఓఈ బి.నాగరాజు, తెలుగు ఇన్‌చార్జ్ డాక్టర్ వెల్దండి శ్రీధర్, డాక్టర్ వైవీఆర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజా సమస్యలు పరిష్కరించకుండా విజయోత్సవాలా..?

- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో హామీలను గుప్పించి.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప మిగిలిన ఏ హామీలను అమలు చేయలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. రైతులకు రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇంతవరకు అందించలేదని, రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కనీసం సగం మందికి కూడా వర్తింపజేయలేదని ఆరోపించారు. మహిళలకు రూ.2,500 భృతి, ఆసరా పింఛన్ల పెంపు వంటి పథకాల ఊసే లేదన్నారు. నల్లగొండ జిల్లా



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడలో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభల్లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా, హామీలు అమలు చేయకుండా ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల సమస్యలను తప్పుదోవ పట్టించడానికే హైడ్రా, మూసీ ప్రక్షాళన వంటి వాటిని తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. మూసీ నది వెంట ఉన్న 15వేల ఇళ్లను కూల్చి మూసీ ప్రక్షాళన చేపట్టాలని చూస్తే ఊరుకోమని, ముందే పేదలకు ఇళ్లు నిర్మించి ఆ తర్వాత మూసీ ప్రక్షాళన చేయాలన్నారు. సీపీఎం చేసిన పోరాటాలతోనే లగచర్లలో ఫార్మాసిటీని ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ సంపదను అదాని, అంబాని వంటి కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రజలపై ధరల భారం మోపుతుందని వీరభద్రం అన్నారు. దేశంలో సామరస్యంగా ఉంటున్న ప్రజల మధ్య మత విద్వేషాలు సృష్టించి బీజేపీ రాజకీయంగా పబ్బం గడుపుతుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ పాల్గొన్నారు.